క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతునికి సేవారత్న పురస్కారం



సేవా రత్న పురస్కారం అందుకుంటున్న విభిన్న ప్రతిభావంతుడు పురుషోత్తమ చౌదరి

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన విభిన్న ప్రతిభావంతుడు కేపీ పురుషోత్తమ చౌదరి(అనేష్)కి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని అన్నమయ్య సేవా సంస్థ సేవారత్న పురస్కారం అందజేసింది. ఆయన ఆదివారం గూడూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రమాదంలో చేయి కోల్పోయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో పలు క్రీడా పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు. ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో విజయం సాధించినట్టు తెలిపారు. అక్కడ వచ్చిన ప్రైజ్ మనీని ఆ ప్రాంతంలోని దివ్యాంగుల నిధికి అందజేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన అన్నమయ్య సేవా సంస్థ తనకు సేవారత్న పురస్కారం అందజేసి సత్కరించిందని తెలిపారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరులోని సీవీసీ పార్కు ప్రాంగణంలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కోడిగుడ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు లేని సమాజం కోసం జేవీవీ ప్రయత్నిస్తోందన్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఇందులో భాగంగా ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు పౌష్టికాహారం, దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లను సూర్యా ఫ్యాన్సీ అధినేత ఒగ్గు వేణుగోపాల్ అందజేశారని పేర్కొన్నారు. నాగరాజు, రాధయ్య, ఇబ్రహీం, ఆనంద్, సుబ్రహ్మణ్యం, సుమన్‌రెడ్డి, శ్రీనివాసాచారి, ప్రభాకర్, చెంచునారాయణ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆసరా పథకం కింద పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సీఆర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు డాక్టర్ జనార్దనరెడ్డి, రోహిణమ్మ దాతృత్వంతో ప్రతి నెలా పేదలకు నెలకు సరిపడా సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కిషోర్ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బురదమయం.. పాఠశాల ఆవరణం



చిల్లకూరు : వర్షం కురిసిన ప్రతి సారీ పాఠశాలలలో నీరు నిలిచిపోయి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ సుమారు 30 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఆవరణం పల్లంగా ఉండడంతో వర్షపు నీరు నిలుస్తోంది. బురదమయంగా మారడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గ్రామంలోని నీరు మొత్తం పాఠశాల ఆవరణలో నిలిచిపోయింది. విద్యార్థులు బురదలోనే నడిచి తరగతి గదిలోకి వెళ్లాల్సి వస్తోంది. విశ్రాంతి సమయంలో అక్కడే ఆడుకోవాల్సిన పరిస్థితి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బడిలోకి నీరు రాకుండా చేయాలని స్థానికులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కండలేరులో 56.480 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరదకాలువ ద్వారా 1,200 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 500, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా కూటమి కుట్రలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా సామాజిక పింఛను పెంపు తప్ప మరే పథకాన్ని అమలుచేయలేదు. ఉచిత ఇసుక అంటూ మోసం చేసింది. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సాగునీటి సంఘాలకు ఎన్నికలు వచ్చాయి. ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉన్న విషయం తెలుసుకున్న కూటమి నేతలు ఎన్నికల్లో అప్రజాస్వామిక పద్ధతులకు తెరతీశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గం వారు నామినేషన్ వేయకుండా కుట్రలు చేశారు. చివరికి అధికార పార్టీ నేతలే వాగ్వాదానికి దిగారు. వాదోపవాదాలు, వివాదాల మధ్య ఎన్నికలు నిర్వహించలేక అధికారులు నానాతిప్పలు పడ్డారు.

– దొరవారిసత్రం

- ఆగిన మేలుపాక సాగునీటి సంఘం ఎన్నిక
- అధికార పార్టీ నేతల మధ్య వాదోపవాదాలు
- జరగని ఓట్ల లెక్కింపు
- సర్దుబాటు కాకపోవడంతో పూలతోటలో అధ్యక్ష ఎన్నిక వాయిదా
- తలలు పట్టుకున్న ఎన్నికల అధికారులు



మేలుపాక సాగు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించాలంటూ అధికారులను కోరుతున్న రైతులు



మేలుపాక సాగు నీటి సంఘం పోలింగ్ బూత్ నుంచి రైతులను బయటకు పంపుతున్న పోలీసు

దొరవారిసత్రం మండలంలోని మేలుపాక సాగునీటి సంఘంలో ఆరు టీసీలు ఉన్నాయి. ఆరు టీసీలకు రెండేసి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. 5వ టీసీ ఏకగ్రీవం కాగా మిగిలిన టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. అన్నింటినీ తమ వారికే కట్టబెట్టాలన్న అధికార పార్టీ ముఖ్య నేతలు ఆదేశించడంతో స్థానిక పీవో వెంకటేశ్వర్లు కావాలనే ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేశారు. చివరికి సమయం అయిపోవడం వల్ల ఎన్నికను వాయిదా వేస్తున్నామని ప్రకటించారు.

రైతుల నిరసన

ఎన్నికలు వాయిదా వేసిన విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసనకు దిగారు. ఓటమి పాలవుతామనే అధికార పార్టీ నాయకులు ఎన్నికలను వాయిదా వేయించారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమకు ఓటు వేసే హక్కు కూడా లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతలు బలం లేక కుట్రలు చేయడం తగదని మండిపడ్డారు.

అధికార పార్టీ నేతల మధ్యే పోటీ

కల్లూరు గ్రామంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు పిల్లి చెంగయ్య, ఇట్టగుట్ట రత్నయ్య పోటీ పడ్డారు. అధిష్టానం నిర్ణయించన వ్యక్తి ఓటమి పాలవుతాడనే భయంతో రైతులు వేసిన ఓట్లను పీవో ఉమామహేశ్వరి లెక్కించకుండానే రెండు మూటలు కట్టుకుని మళ్లీ లెక్కిస్తామని చెప్పి వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ ఎన్నిక ఏమైందనే విషయం ఎవరికీ అర్థం కావడంలేదు. పోటీలో ఉన్న ఇద్దరూ అధికార పక్షంతోపాటు సమీప బంధువులు. అంతేగాక ఇద్దరూ గతంలో ఎంపీపీలుగా పనిచేశారు.

టీసీల మధ్య కుదరని ఏకాభిప్రాయం

పూలతోట గ్రామంలో నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఆరు టీసీలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడి ఎన్నిక విషయంలో టీసీల మధ్య ఏకభిప్రాయం కుదరలేదు. అధిష్టానం నిర్ణయించిన రైతుకు పదవి వరించకపోవడంతో అధ్యక్ష ఎన్నిక వాయిదా పడింది. ఉచ్చూరు, తనియాలి గ్రామాల సాగునీటి సంఘాల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయం కొలిక్కిరాకపోవడంతో చాలా ఆలస్యంగా ఎన్నికలు నిర్వహించారు. ఉచ్చూరులో రాత్రి వరకు ఎన్నికలు జరిగాయి.

36 గాను 33 ఏకగ్రీవం

డీవీ సత్రంలో 36 సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించగా 33 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన చోటవివిధ కారణాలు చూపి అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. ఎన్నికలు జరగని ప్రాంతాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి నిర్వహిస్తామని మండల ప్రత్యేక అధికారి హరికృష్ణ తెలిపారు.





కల్లూరులో ఓట్లను లెక్కించకుండా మూట కట్టుకుని వెళ్లిపోతున్న ఎన్నికల సిబ్బంది

టిప్పర్లను నియంత్రించాలి

- చిలమానుచేను గ్రామస్తుల ధర్నా
- రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం
- దుమ్ము పేరుకుపోవడంతో నిమ్మ దిగుబడి తగ్గుతోందని ఆవేదన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఓజిలి: అధిక లోడుతో టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్డు ధ్వంసమైందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చిలమానుచేను గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఆదివారం సర్పంచ్ పారిచర్ల సాయిరాం ఆధ్వర్యంలో టిప్పర్లను అడ్డుకుని, నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ టిప్పర్లు వెళ్లేటప్పుడు దుమ్ము రేగి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనారోగ్యం బారిన పడుతున్నామని చెప్పారు. నిమ్మతోటలకు తెగుళ్లు సోకి పంట దిగుబడి తగ్గిపోతోందన్నారు. టిప్పర్ల విషయం ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారిపై అనుమతి లేని టిప్పర్లు తిరుగుతున్నా.. సంబంధిత అధికారులు మాముళ్ల మత్తులో పడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏఎస్ఐ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. వారు ససేమిరా అనడంతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో వాగ్వాదం నెలకొంది. టిప్పర్లు రాకపోకలను కచ్చితంగా నిలిపివేయాలని లేదంటే నిరసనలు తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని రాణిపేటలో మార్పు సంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్, షర్మిల ఏర్పాటుచేసిన మదర్ థెరిస్సా వృద్ధుల ఆనంద ఆశ్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఏపీపీ ప్రకృతి కుమార్ మాట్లాడుతూ వృద్ధుల కోసం ఆశ్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి, డక్కిలి ఎస్ఐలు గోపి, శివశంకర్, సభ్యులు మాధవ్, పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

కర్రసాములో నాయుడుపేట క్రీడాకారుల ప్రతిభ



పతకాలు చూపుతున్న క్రీడాకారులు

నాయుడుపేట టౌన్ : జాతీయ స్థాయి కర్రసాము 1వ చాంపియన్‌షిప్ పోటీల్లో నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపినట్టు కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలో కర్రసాము చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్, విభాగాల్లో నాయుడుపేటకు చెందిన 23 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు వెల్లడించారు. 8 బంగారు, 6 రజిత, 9 బ్రాంజ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. వారికి ఫెడరేషన్ అధ్యక్షుడు కె.శ్రీహరి పతకాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ మజీద్, కర్రసాము రాష్ట్ర ఇన్‌చార్జి సాయిబాబా, ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అంకాళమ్మగుడి వీధిలో ఉంటున్న సుశీల్ కుమార్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. బీహర్ ప్రాంతానికి చెందిన సుశీల్‌కుమార్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటి ముందు బైక్‌ను నిలిపాడు. ఆదివారం ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



హరినాథ్‌రెడ్డి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు

పెళ్లకూరు : మండలంలోని నందిమాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హరినాథ్‌రెడ్డి(90) అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న పలువురు నేతలు గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బంగారంపేట సర్పంచ్ నాగేంద్రరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, ప్రసాద్‌నాయుడు, కృష్ణయ్య, యుగంధర్, హరినాయుడు, సిద్దులయ్యనాయుడు, రమణయ్య తదితరులు ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సైదాపురం: దళితుల భూములను ఆక్రమించుకోవడంతోపాటు దౌర్జన్యం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సైదాపురంలో విలేకరులతో మాట్లాడారు. జోగిపల్లిలో దళితులు ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వాటిని ఆ గ్రామానికి చెందిన భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. అంతేగాక దళిత మహిళపై దాడి చేశారని దుయ్యబట్టారు. వారిని అరెస్టు చేయాలని, లేని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంకయ్య, చెంగల్రావు, వేణయ్య, బాలు, మమత, రమణమ్మ, యశోదమ్మ, శారద తదితరులున్నారు.

'దళితుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు'



మాట్లాడుతున్న సుబ్బారావు

చిల్లకూరు : దళితులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు విమర్శించారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఆదివారం డీహెచ్‌పీఎస్ నిర్మాణ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు హక్కుల గురించి అందరూ మాట్లాడతారని, వాటిని అమలు చేసే విషయంలో వెనకడుగు వేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతి జిల్లాలో దళితలపై అనేక దాడులు జరిగినా పట్టించుకునే నాథుడు లేడన్నారు. పేద దళితల భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లికి చెందిన దళితులు అనేక ఏళ్ల నుంచి భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారిపై అక్రమంగా కేసులు బనాయించడం దారుణమన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడతామన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, నాగరాజన్, ఆర్. బలరాం, చినకాలయ్య, సీపీ జిల్లా కార్యదర్శి మురళీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్, తులసీరాజన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ యాగం



చండీ యాగం చేస్తున్న భక్తులు

చిల్లకూరు : తీరప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీ యాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన పెనాక భాస్కరరెడ్డి, పద్మమ్మ దంపతులు, వారి కుమారులు హర్షవర్ధనరెడ్డి, సుమంత్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయంలో ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి 12 కలశాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ మాట్లాడుతూ ఆలయంలో ఎక్కువగా బలి పూజలు చేస్తారని, వాటిని తగ్గించి అమ్మవారికి ఇష్టమైన చండీ యాగం నిర్వహించేలా భక్తులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, అర్చకులు శివకుమార్ స్వామి పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట స్వర్ణ ముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణముఖి నది నుంచి 108 బిందెలతో జలం తీసుకువచ్చి అమ్మవారిని అభిషేకించారు. సాయంత్రం పల్లకి సేవ, పంచ హారతి, దీపోత్సవం చేపట్టారు. పేదలకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా అగ్రహారపేటలో ఉన్న నాగమాసాలమ్మ(మానసదేవి), అగ్రహారపేట అరుంధతీయ వాడలో ఉన్న మాత పరమేశ్వరి దేవి ఆలయాల్లో పౌర్ణమి పూజలు చేశారు. శ్రీదత్త జయంతి సందర్భంగా అగ్రహార పేటలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేపట్టారు.

అంకాళమ్మకు ప్రత్యేక పూజలు

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకం, పూలంగి సేవ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు.

శివాలయంలో పౌర్ణమి వేడుకలు



గోపూజ చేస్తున్న ఉభయదాతలు

తడ: తమిళ కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మాంబట్టులోని గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలతోపాటు టీటీడీ అన్నమాచార్య భక్త బృందం హరికథా కాలక్షేపం, గోపూజ చేశారు. ఉమ్మిటి చండీరాణి, కుమారస్వామి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. దేవేందర్‌రెడ్డి, పురుషోత్తం, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ హీరోయిన్ రీతూవర్మ



బోణీ చేస్తున్న కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణం బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన సీఎంఆర్ చందన షాపింగ్ మాల్‌ను ఆదివారం ప్రముఖ సినీ హీరోయిన్ రీతూవర్మ, స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాల్లో బంగారం, బట్టల వ్యాపారం చేసే సీఎంఆర్ సూళ్లూరుపేట లాంటి చిన్న పట్టణంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వారు స్థిరనివాసం ఏర్పరుచుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇక్కడ కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి ఉత్సాహంచూపుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ యజమానులు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



గూడూరు రూరల్ : చిన్నారుల నాటక ప్రదర్శన

వెంకటగిరి రూరల్ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలోని లూథరన్ చర్చిలో ఆదివారం యూత్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగలో భాగంగా ముందస్తు వేడుకలను జరుపుకుంటున్నట్లు తెలియజేశారు.

లోక రక్షకుడు క్రీస్తు

గూడూరు రూరల్ : ఏసు క్రీస్తు లోక రక్షకుడని పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘ కాపరి రెవరెండ్ డేవిడ్ ప్రశాంతరాజ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని చర్చిలో ఆదివారం క్రిస్మస్ నెల మూడో అడ్వెంట్ సందర్భంగా మహిళా సమాజ సభ్యులు క్యాండిల్ ర్యాలీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి మాట్లాడుతూ ఈ నెల 25న క్రిస్మస్ సందర్భంగా ముందస్తు వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు పుట్టుక నాటకం ఆకట్టుకుంది.

ఆదర్శమూర్తి పొట్టిశ్రీరాములు



కోట : పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



నాయుడుపేట టౌన్ : పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



వెంకటగిరి : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కోట : అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని ఆదివారం కోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. కోట బజారువీధిలో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు జీవితం ఆదర్శమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో నందగోపాల్, విజయభాస్కర్, నాగరాజు, వాసు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి అవమానం

నాయుడుపేట టౌన్ : ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములను ప్రజా ప్రతినిధులు, అధికారులు అవమానించారని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆరోపించారు. వారు ఆదివారం పాత బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కనమర్లపూడి సుబ్రమణి, తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, కే సురేంద్ర, కోట వెంకటేశ్వర్లు, మునగాల కృష్ణారావు, కిరణ్‌కుమార్, దోర్నాదుల యతీంద్ర, మెంటా మల్లి, సోల్లేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి, ఉపాధ్యాయులు రత్నశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.